
# అమ్మలూ, జిందాబాద్!



తెల్లవారి నిద్ర లేచేటప్పటికి వీధిలో జనమంతా జట్లు జట్లుగా చేరి మాట్లాడుకోవడం కనిపించింది. విషయమేమిటని విచారించగా 'అవ్వ చచ్చిపోయిందట' అన్న వార్త తెలిసింది. ఆ వార్త విన్న నేను 'అయ్యో పాపం!' అంటూ రెండు నిమిషాలు మరేమీ మాట్లాడలేకపోయాను.

'ఎవరా అవ్వ?' అని మీరు సహజంగానే అనుకోవచ్చు. బహుశ అవ్వ అసలు పేరు చాలమందికి తెలియకపోవచ్చు. కారణం ఏదైనా ప్రస్తుతం పిల్లలు, పెద్దలు, అందరూ ఆ ముసలమ్మను 'అవ్వా!' అనే పిలవడం అలవాటైపోయింది.

కొమ్మిశెట్టి మోహన్

కానీ, ఆ అవ్వకూ ఒక పేరుంది. ఆమె పేరు పూర్ణమ్మ. బహుశ పూర్తి పేరు 'అన్నపూర్ణమ్మ' అయి వుండవచ్చు. అలాగే ఆ అవ్వకూడ ఒకరికి అమ్మే! ఆ అమ్మకు ముగ్గురాడపిల్లలు. ఒక్కగానొక్క కొడుకు. అయినా ఆ 'అవ్వ' అదే, ఆ 'అమ్మ' ప్రస్తుతం ఒంటరిది. ఆమె భర్త జీవించి వుండగానే పిల్లలందరికీ ఎలాగో పెళ్ళిళ్ళు చేశారు. ఆడపిల్లలు తమ భర్తలతో కాపురాలు చేసుకుంటున్నారు.

ప్రస్తుతం వూర్లో ఆమె ఏకైక పుత్రుడు తన భార్యాబిడ్డలతో వుంటున్నాడు. మరి అవ్వ ఒంటరిదెలా అవుతుంది?

జీవితం మీద ఏమాత్రం అవగాహన వున్నా, మీకీ సందేహం రాదు. రాకూడదు కూడ! ఎందుకంటారా? ఆధునిక సౌకర్యాలు విపరీతంగా వున్న సభ్య సమాజంలో ప్రతిమనిషి వీలున్నంత వరకు విలాసవంతమైన స్వేచ్ఛా జీవితం కోరుకుంటున్నాడు కదండీ! అందుకే మనిషిలో స్వార్థం పెరిగిపోయింది. మనసు సంకుచితమైపోయింది. అలాంటపుడు అతను మాత్రం ఏం చేయగలడు చెప్పండి? ఈ నియమం అందరికీ వర్తిస్తుందని చెప్పలేము కానీ ప్రస్తుత సమాజంలో ఇది చాలమంది వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్య. చాలమంది వృద్ధుల పాలిటి శాపం. అందుకనే అవ్వ ఒంటరిది.

ఇలాంటి దగాపడిన వృద్ధులకోసమే పూర్వం కొంతమంది ఉదార స్వభావులు వూర్లలో సత్రాల్లాంటివి కట్టించారు కాబోలు! అవ్వకూడ ఆ వూర్లో అలాంటి ఒక సత్రంలో తలదాచుకుంటోంది.

అవ్వ తన కుమారునికి, కోడలికి కంటిలో నలుసులా, పంటికింది రాయిలా అనిపించిందేమో గానీ, వూర్లోవారికి మాత్రం తల్లో నాలుకలా వుండేది.అవ్వ మానవతావాదిలా, సామ్యవాదిలా అందరి అవసరాలకు ఉపయోగపడేది. ఒకరింట్లో పాచిపనిచేసేది. మరొకరింట్లో బియ్యమో, బేడలో శుభ్రం చేసేది. ఇంకొకరింట్లో మగవారు వూర్లో లేనప్పుడు ఆడవారికి తోడుగా వుండేది. ఇలా ఆరోగ్యం బాగాలేక కొందరు, ఉద్యోగాలు చేస్తున్నందున తప్పనిసరి పనుల్లో సాయంకోసం కొందరు,తిండి ఎక్కువై ఆయాసంతో కొందరు, తిండి సహించక నీరసంతో కొందరు, స్టేటస్‌కోసం కొందరు, పొరుగింటావిడ పనిమనిషిని వుంచుకుంటే, తాను మాత్రం తక్కువేమిటనే పోటీతత్త్వంతో మరొకరూ, ఇలా వూర్లోని అమ్మలక్కలందరూ ఎప్పుడో ఒకప్పుడు అవ్వ సాయం పొందినవారే!

అయితే అంత వయసులోనూ అవ్వ అలా అడిగినవారికి కాదనకుండా ఎలా పనులు చేయగలుగుతోంది. అదే అందరికీ ఆశ్చర్యం కలిగించే విషయం. ఏడుపదులకు తక్కువ కాని వయసు, తైల సంస్కారం లేని చింపిరితల. విల్లులా వంగిన నడుము, ముడుతలు బడిన ముఖం. అక్కడక్కడ చిరుగులు కుట్టిన చీర- ఇదీ అవ్వ ఆకారం. ఆ వయసులో కూడ ఎంతో ఓపికగా, ఓర్పుతో ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూ వుండేది. అది ఆమెకు దేవుడిచ్చిన వరం. ఎప్పుడైనా దగ్గో, జ్వరమో వస్తే ధర్మాసుపత్రికి పోయి ఒక సూది పొడిపించుకుని, రెండు మాత్రలు మింగేది. సత్రంలో తన కుక్కి మంచంలో ఒక వూట ముడుచుకుని పడుకునేది. మళ్ళీ తెల్లవారేటప్పటికి అవ్వకు ఎక్కడ లేని ధైర్యమూ, సత్తువా, ఓపికా వచ్చేవి.

తాను చేసే చాకిరీకి ప్రతిఫలంగా అవ్వ, 'నాకింత కావాలి! ఇదే కావాలి!' అని ఎవరినీ బలవంతంగా అడిగేది కాదు. ఏ పూట ఎక్కడ పని చేస్తే ఆ పూట ఆ ఇంట్ల ఇచ్చిన కాఫీ త్రాగేది. వారు పెట్టిన టిఫినో, అన్నమో తినేది. వారు ఇచ్చే పాత చీరలు తీసుకునేది.

అలాంటి అవ్వ చచ్చిపోయిందని వినగానే మనసంతా అదోలా అయింది. ఎవరో ఆత్మీయురాలిని కోల్పోయినట్లు మనసు బాధతో మూల్గింది. త్వరగా కాలకృత్యాలు తీర్చుకుని సత్రంవద్దకు వెళ్ళాను. అక్కడ ఇంకా జనం గుమిగూడి వున్నారు. అవ్వను గురించే మాట్లాడుకుంటున్నారు. 'రాత్రివరకు బాగానే వుంది. ఏ తెల్లవారురఝామునో ప్రాణం పోయివుంటుంది. ఎంతో అదృష్టవంతురాలు! చివరివరకు ఒకరిమీద ఆధారపడకుండా ప్రశాంతంగా కన్నుమూసింది. ఏ జబ్బో చేసి దీర్ఘకాలం పడకుండా ప్రశాంతంగా కన్నుమూసింది. మంచానపడితే పాపం ఆమెనుచూసే దిక్కెవరు? పుణ్యాత్మురాలు!'ఇలా ఎవరికి తోచిన

అవ్వ మానవతావాదిలా, సామ్యవాదిలా అందరి అవసరాలకు ఉపయోగపడేది.
ఒకరింట్లో పాచిపనిచేసేది. మరొకరింట్లో బియ్యమో, బేడలో శుభ్రం చేసేది.
ఇంకొకరింట్లో మగవారు వూర్లో లేనప్పుడు ఆడవారికి తోడుగా వుండేది.



కథ

రీతిలో వారు మాట్లాడుకుంటున్నారు.

ఇంతలో అవ్వ కొడుకు అక్కడికి వచ్చాడు. శవాన్ని ఇంటికి తీసుకుపోతాడో లేక ఇక్కడి నుంచే సాగనంపుతాడో! చాలమందికి కుతూహలం! సస్పెన్స్!' అందుకు కూడ కారణం లేకపోలేదు.



అవ్వ కుమారుడు, ఇంతకీ పేరు చెప్పలేదు కదూ! రామయ్య! తల్లిదండ్రులు చిన్నప్పుడు ఏ ఉద్దేశ్యంతో పేర్లు పెడతారో గానీ, ఇందులో ఒక తమాషా వుంది. చాల సందర్భాల్లో పేరుకీ, మనిషి స్వభావానికీ పొంతన కుదరదు. బహుశ తల్లిదండ్రులు ముందే వూహించినట్లు, కనీసం పేరులోనైనా ఔన్నత్యాన్ని చూసుకుని సంతృప్తి పడదామనుకుంటారు కాబోలు!

ఆనాడు దశరథరాముడు తండ్రిమాటకోసం తాను ఇల్లువిడిచి అడవికి వెళ్ళాడు. కానీ ఈ రాముడు భార్యమాట కోసం- అలా అనడం కూడ అన్యాయంగా వుంటుందేమో! మరి, రెండు చేతులు కలిస్తేనే కదా చప్పుడయ్యేది! కాబట్టి భార్యాభర్తలిరువురి మాటకోసం అవ్వను ఇంటినుంచి బయటకు గెంటేశాడు.

అలా తన మాటకు ఇప్పటికీ కట్టుబడి వున్నాడు. ఆఖరికి నాలుగైదేండ్ల క్రితం తాను కొత్తగా కట్టుకున్న ఇంటి గృహప్రవేశం రోజు కూడ అమ్మని ఇంట్లోకి రానీయకుండా చేసిన కఠోర నియమ, నిష్ఠాగరిష్టుడు. ఆరోజు గృహప్రవేశంనాడు తనకున్నంతలో బంధు, మిత్రులను పిలిపించి ఘనంగానే జరుపుకున్నాడు రామయ్య. తన అమ్మ ఎక్కడ వ్రత భంగం చేసి పొరబాటున ఇంట్లోకి వస్తుందోనన్న భయంతో తన కొడుకులతో రాయబారం పంపాడు.

'ఈరోజు ఇంటికి చాలమంది కొత్తకొత్త వారంతా వస్తారు. అప్పుడు నువ్వు వాళ్ళందరి ముందూ ఈ అవతారంతో కనబడితే నాన్నకు అవమానంగా వుంటుందట...' మనుమలు అవ్వతో అమాయకంగా చిలుక పలుకులు పలికి వెళ్ళారు.

'నిజమే! నాదేముంది! అంతగా చూడాలనుకుంటే ఈరోజు కాకపోతే మరో రోజైనా చూడచ్చు. అందరిముందు పాపం వానికి అవమానం చేయడమెందుకు?' సంబాలించుకుంది అవ్వ!

'ఏం అవ్వా! నీ కొడుకు ఈరోజైనా నిన్ను ఇంటికి పిలవలేదా?' అని ఎవరైనా అడిగితే, 'నాదేముందయ్యా! వాడేదో సంతోషంగా నలుగురినీ పిలుచుకుని సంబరం చేసుకుంటున్నాడు. ఈ అవతారంతో నేనెందుకు చెప్పు?' అని తప్పుకునేది.

అయినా రామయ్య, ఆయన సహధర్మచారిణి సుందరమ్మలవి మరీ అంత పాషాణ హృదయాలు కావు. సందడి అంతా సద్దుమణిగాక, ఎప్పుడో రాత్రికి ఇంత అన్నం, పాయసం కొడుకులతో ఇచ్చి పంపారు అవ్వకి.

అలా కొడుకు, కోడలిచేతి అన్నం పరోక్షంగానైనా తినే అదృష్టం అవ్వకు నెలకొకసారి తప్పక కలుగుతుంది. ప్రభుత్వం ఇచ్చే తెల్లకార్డు బియ్యం అవ్వ తెచ్చుకుని మాత్రం ఏం చేస్తుంది. శ్రద్ధగా మనువళ్ళని పిలిపించుకుని ప్రతినెలా ఆ బియ్యం కొడుకింటికి చేర్చేది. ఎవరైనా 'ఏమిటి నీ చాదస్తం' అని అడిగితే,

'నాకెందుకు నాయనా! ముసలి ప్రాణం! ఎవరో ఒక అమ్మ పెట్టే ముద్ద చాలు, ఈ ప్రాణం నిలుపుకోడానికి. పాపం, పిల్లలు కలవాడు, నాలుగు రోజులకైనా ఉపయోగపడనీ!' అలా అంటున్నప్పుడు ఆమె కళ్లలో అపారమైన సంతృప్తీ, వెలుగూ కనిపించేవి. బియ్యం తీసుకున్న రోజు రాత్రికి మాత్రం సుందరమ్మ ఇంత అన్నం పంపించేది అవ్వకు.

'ఆ ముసలామె రుణం మాకెందుకు వదినా! అన్నం పప్పు, చారు పంపించాను' ఆరోజు ఇరుగమ్మ పొరుగమ్మలతో తన దాతృత్వం గురించి ఘనంగా చెప్పుకునేది సుందరమ్మ.

ఆ రుణం అంత సులభంగా తీరేది కాదని తెలియని ఆమె మూర్ఖత్వానికి ఏడవాలో, నవ్వాలో, తెలియక ఆ పొరుగింటావిడ ఆమె ఎదుట మాత్రం, 'నిజమే వదినా!' అని ఆమె దాతృత్వాన్ని మెచ్చుకునేది. చాటుగా మరొక వదినగాని వదినతో, 'చూశావా వదినా! దాని దాతృత్వం! అలా చెప్పుకోవడం దానికే చెల్లు!' అని దీర్ఘం తీసి చెప్పేది.

ఇలాంటి నేపథ్యంలో రామయ్య అమ్మ శవాన్ని ఇంటికి తీసుకుపోతాడా లేదా సత్రం నుంచే సాగనంపుతాడా? అన్నది కుతూహలం కలిగించదా మరి! ఎట్టకేలకు సస్పెన్స్ వీడింది. శవాన్ని తన ఇంటినుంచే సాగనంపడానికి తీసుకువెళ్ళాడు రామయ్య.

ఇందులో ఆశ్చర్యపోవడానికేముంది? ఇలాంటి సన్నివేశాలు మనం సమాజంలో చాలానే చూస్తున్నాము కదా! బ్రతికుండగా తల్లిదండ్రులకు ఒక పూట అన్నం పెట్టనివారూ. బిడ్డ శ్రమపడుతున్నా రోజూ ప్రోత్సాహపరచనివారూ. ఇంట్లోనే వుంటూ ఎలా వున్నావని నోరారా ఆప్యాయంగా పలుకరించనివారూ. చనిపోగానే మేళతాళాలతో శవయాత్ర జరిపిస్తారు. పీడ శాశ్వతంగా వదలిపోయిందన్న సంతోషం పట్టలేక కాబోలు! మరి, ఏమిటో వారి ఆంతర్యం?

శవయాత్రకు సన్నాహాలు జరుగుతూ వుండగానే ఆ వీధిలోని జానకమ్మ, సుందరమ్మ చేతిలో కొంత డబ్బు వుంచింది.

'అవ్వ, ఈ డబ్బు అప్పుడప్పుడూ నా వద్ద దాచుకుంది సుందరమ్మా! మొత్తం తొమ్మిది వందల యాభై నాలుగు రూపాయలున్నాయి. 'అవసరానికి వుంటుంది. నాకు అవసరమొచ్చినపుడు నేనే అడిగి తీసుకుంటాను. నీ దగ్గర వుండనీ!' అని చాల రోజులుగా అప్పుడప్పుడు నా వద్ద దాచుకుంది పాపం!' అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది జానకమ్మ.

అక్కడ చేరిన వారందరి హృదయాలు ద్రవించిపోయాయి. చిందరవందరగా వుండే వృద్ధురాలు, అవ్వ రూపం మహోన్నతంగా నా మనోఫలకం మీద కదలాడింది.

అమ్మ రుణం తీర్చుకోలేనిదంటారు. అలాంటి అమ్మ చివరి క్షణంలో కూడ తానుగా ఎవరికీ రుణపడకూడదనుకుంది కాబోలు. చివరికి కొడుక్కి కూడ! అందుకనే ముందు చూపుతో తన చివరి ప్రయాణం కోసం పైసా పైసా సమకూర్చి వెళ్ళింది ఆ అమ్మ. ఎప్పుడూ నిబ్బరంగా, నిరాసక్తంగా కనిపించే అవ్వలో ఇంత పౌరుషం, ఆత్మాభిమానం దాగివుందా? నేనాశ్చర్యపోయాను. సమాజంలో ఇలాంటి అమ్మలు ఎందరో! మనసులోనే భక్తితో వారందరికీ జోహారులర్పించాను.

'అమ్మలూ, జిందాబాద్!'

ప్రభుత్వం ఇచ్చే తెల్లకార్డు బియ్యం అవ్వ తెచ్చుకుని మాత్రం ఏం చేస్తుంది. శ్రద్ధగా మనువళ్ళని పిలిపించుకుని ప్రతినెలా ఆ బియ్యం కొడుకింటికి చేర్చేది. ఎవరైనా 'ఏమిటి నీ చాదస్తం' అని అడిగితే,

'నాకెందుకు నాయనా! ముసలి ప్రాణం! ఎవరో ఒక అమ్మ పెట్టే ముద్ద చాలు, ఈ ప్రాణం నిలుపుకోడానికి. పావం, పిల్లలు కలవాడు, నాలుగు రోజులకైనా ఉవయోగవడనీ!' అలా అంటున్నప్పుడు ఆమె కళ్లలో అపారమైన సంతృప్తీ, వెలుగూ కనిపించేవి.